# ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

మూడవరోజు లలితా దేవిగా భక్తులకు దర్శనం

2 లో






# మనం

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

బుధవారం | 18 | అక్టోబర్ | 2023 | పేజీలు : 7


# సిద్దిపేట వజ్రపు తునక

- ఇక్కడికి రాందేది.... లేందేది...
- ఉద్యమానికి పునాది వేసింది సిద్దిపేట
- రాష్ట్రానికే తలమానికం
- ఎక్కడ ఉన్నా మిమ్మల్ని మరువ
- ఆరడుగుల బుల్లెట్టు అద్భుతం చేసిండు
- రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు













సిద్దిపేట, అక్టోబర్ 17, మనం న్యూస్ ప్రతినిధిః ఎట్లుండె సిద్దిపేట ఎట్లయ్యింది... ఇయ్యాళ్ల సిద్దిపేటకు రానిదేది...? ఇక్కడ లేనిదేది...? ఒక్క గాలిమోటారు తప్ప అన్నీ వచ్చాయి. రాబోయే రోజుల్లో సిద్దిపేట వజ్రపు తునక కాబోతుంది. హరీష్‌రావు స్థానంలో నేనున్నా ఇంత చేసేవాన్ని కాదేమో...! అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పురిటిగడ్డపై అడుగుపెట్టి జనసంద్రాన్ని చూసి పులకించిపోయి మాట్లాడిన మాటలివి. జన్మ భూమిని మించింది లేదు.. సిద్దిపేట పేరు వింటేనే ఒక రకమైన పులకింత. సాదింది మీరు... పెద్దను చేసింది మీరు... రాజకీయ జన్మనిచ్చింది మీరు.. సీఎం అయ్యేంత ఎత్తుకు పెంచింది మీరంటూ సిద్దిపేటతో తనకున్న అనుబంధాన్ని, సిద్దిపేట ప్రజలంటే తనకున్న మమకారాన్ని, పుట్టిన భూమితో మిగతా 2లో..





# కారణజన్ముడు కేసీఆర్

**నాడు దరఖాస్తు ఇచ్చి నేడు నిజం చేశారు**

**కాళేశ్వరంతో కరువు మాయం**

**నాడు కూలీ లేదు... నేడు కూలీలు దొరుకుతలేరు**

**మంత్రి హరీష్‌రావు**

సిద్దిపేట, అక్టోబర్ 17, మనం న్యూస్ ప్రతినిధిః ఎవరైనా కలలు కంటారు. కానీ కలలను నిజం చేసుకునే అదృష్టం అందరికీ దక్కదు. కల కనడమే కాదు... కలను సాకారం చేసిన కారణజన్ముడు కేసీఆర్ అన్నారు. ఒకనాడు ఎన్నికల నినాదాలు, గోడలపై రాతలను తుడిచేసి నిజం చేసిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా నాటి కలలను సాకారం చేసి పురిటిగడ్డ రుణం తీర్చుకున్న కేసీఆర్ హాజరైన ఈ సభకు వచ్చిన జనాన్ని చూస్తుంటే ఎన్నికల సభగా లేదు.. కృతజ్ఞత సభగా ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట బహిరంగ సభకు కేసీఆర్ హాజరుకాగా మంత్రి హరీష్‌రావు స్వాగతోపన్యాసం చేశారు. నాడు సిద్దిపేట ఎమ్మెల్యేగా కేసీఆర్ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌కు జిల్లా చేయాలని దరఖాస్తు ఇచ్చిన చేతులతోనే నేడు సీఎం హోదాలో దర్జాగా సంతకం పెట్టి సిద్దిపేటను జిల్లా చేశారన్నారు. యుపిఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఉన్ననాడు రైలు మార్గాన్ని మంజూరీ చేయిస్తే రాష్ట్ర వాటా చెల్లించకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. ఉద్యమ నేత కేసీఆర్ సీఎం కాగానే రాష్ట్ర వాటా రూ.630 కోట్లు విడుదల చేసి బుల్లెట్ వేగంతో సిద్దిపేటకు రైలును తెచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఒకనాడు గోదావరి నీళ్ల తెస్తామంటే ఎకసెకాలాడిన వారి నోర్లు మూయించేలా మూడేళ్లలో కాళేశ్వరం పూర్తి చేసిన కార్యముఖుడు కేసీఆర్ కాదా అన్నారు మిగతా 2లో..

# కారణజన్ముడు కేసీఆర్

మొదటి పేజీ తరువాయి..

ఒకనాడు గ్రామాల్లోకి వెళ్తే కరువుతో అల్లాడుతున్నాం... కూలీ పనులు కల్పించండని అడిగిన నోర్లే నేడు గోదావరి జలాల రాకతో బీడు భూములన్నీ పచ్చని పైర్లుగా మారి కైకిలోళ్లు దొరకడం లేదనే పరిస్థితి వచ్చిందంటే అది ప్రభుత్వ చిత్తశుద్ధి కాదా అన్నారు. కరువుతో వలస వెళ్లినా ప్రాంతంలో ఛత్తీస్‌గడ్ నుండి వచ్చిన మగ కూలీలు వరి నాట్లు వేస్తారా అని కనీసం కలలైనా కన్నారా అన్నారు. పశుగ్రాసం లేక ఇబ్బంది పడ్డ పరిస్థితులు పోయి కోనసీమను తలపించేలా సిద్దిపేటను మార్చింది ఎవరో ఆలోచించండి అన్నారు. నాడు పిల్లల పెళ్లిలకో, ఆరోగ్యం బాగాలేకపోతే ఆసుపత్రుల ఖర్చులతో నాలుగైదు లక్షలకు ఎకరం భూమిని అమ్ముకున్న పరిస్థితి నుండి నేడు ఒక్కో ఎకరం రూ. 1 కోటి కి చేరిందంటే అది ప్రభుత్వ చిత్తశుద్ధి కాదా అన్నారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడూ వ్యవసాయం చేశారు.. కేంద్ర మంత్రైనా ఎవుసం మరువలే... నేడు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నా ఎవుసాన్ని మరువని రైతుబిడ్డ కేసీఆర్ కాబట్టే రైతుల బాధలను దూరం చేసే బాధ్యత భుజాన ఎత్తుకున్నారన్నారు ఒక్క ఛాన్స్ అంటూ నేడు పొర్లుదండాలు పెడుతున్న కాంగ్రెస్‌కు 11 ఛాన్స్‌లిచ్చినా తాగునీరివ్వలేని చేతగాని పార్టీ అంటూ విమర్శించారు. ఎండాకాలంలో మత్తళ్లు దుంకుతున్నాయని, నాడు రాజ్‌గోపాల్‌పేట చెరువు నిండితే ఒక వార్తయితే, ఇక బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు ఎండంగ చూడబోమన్నారు. కేసీఆర్ ఆశీర్వాదం, మీ అందరి ప్రేమతో ఇంతవాడినయ్యా. శ్వాస ఉన్నంత వరకు మీ సేవలోనే పునరంకితమవుతా... మీరు చూపిన ప్రేమకు చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే... సిద్దిపేటే నా కుటుంబం.... అంటూ హరీష్‌రావు తన ఉపన్యాసాన్ని ముగించారు.

## ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

### మూడవరోజు లలితా దేవిగా భక్తులకు దర్శనం



మిరుదొడ్డి, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలోని కశీర్ వద్ద నెలకొల్పిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మూడవ రోజైన మంగళవారం లలితా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వేద బ్రాహ్మణోత్తములచే నిత్యం 9 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, నేడు అమ్మవారి వద్ద ఉదయం 9 గంటలకు హోమం నిర్వహించడం జరుగుతుందని, కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

### సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు కుమ్మరి జగన్నాథం



పాపన్నపేట, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః మండల పరిధిలోని కొత్తపల్లిలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. చెవుల బిక్షపతి, ఎండి. అఫ్జల్, గడ్డమీది మల్లేశం స్మారకార్థం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు వివిధ గ్రామాల నుండి క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కుమ్మరి జగన్నాథం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, అప్పుడే నిజమైన క్రీడాస్ఫూర్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధ్యక్షులు బోయిని అంతయ్య, వార్డు మెంబర్లు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, పిఈటిలు కుమార సోమశేఖర్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట వజ్రపు తునక

మొదటి పేజీ తరువాయి..

తనకున్న బంధాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. అవసరమైన ప్రతి సందర్భంలో విజేతగా నిలిపారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో పేర్లు ఇప్పటికీ యాదున్నాయి. మంచినీళ్ల కరువొస్తే ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకున్న పరిస్థితి నుండి రంగనాయక సాగర్‌వంటి అద్భుత ప్రాజెక్టును సాధించుకున్న సందర్భం వరకు అనేక జ్ఞాపకాలు. ఎల్‌ఎండి నుండి నీళ్లు తెచ్చుకొని నాడు జలజాతర చేసుకున్న సందర్భమే నేటి మిషన్ భగీరథకు నాంది ......అంటూ సిద్దిపేటపై తనకున్న ప్రేమను , హరీష్‌రావు అభివృద్ధిని మెచ్చుకుంటూ కేసీఆర్ మాట్లాడుతుంటే జనమంతా పులకరించిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు ముస్తాబాద్ రోడ్డులోని శివాజీ చౌక్ సమీపంలో సిద్దిపేట ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ తాను తిరగని ఊరు లేదు, తాను చూడని చెరువు లేదు... ప్రతీ గల్లీ తనకెంతో అనుబంధమన్నారు. నాడు సమైక్యవాద కుట్రలను ఛేదించేందుకు తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకొని బస్సు గుర్తుతో మీ ముందుకు వస్తే సమైక్య వాదులు విసిరిన నోట్ల కట్టలను దాఖలు చేయక ఉద్యమానికి పునాది వేసింది ఈ గడ్డ అన్నారు. తాను ఎక్కడ వెళ్లినా సిద్దిపేటను మరువలే. కోనాయిపల్లి వెంకటేశ్వరుని పాదాల చెంత నామినేషన్‌లు ఉంచి బయల్దేరిన ప్రతి సందర్భంలో విజయమే వరించింది. సిద్దిపేటను వదిలి ఎంపిగా గెలిచిన సందర్భంలో ఎట్లా అని అందరం కలిసి ఏడ్చిన రోజులు యాదికున్నాయి. అంతలోనే ఆరడుగుల





బుల్లెట్టు హరీష్‌ను మీకప్పగిస్తే సిద్దిపేట ఖ్యాతి ఇసుమంత తగ్గించకుండా నేడు అభివృద్ధిలో శిఖరాగ్రంలో నిలిపాడన్నారు. ఒక దశలో అనిపిస్తుంది... హరీష్‌రావు స్థానంలో నేనున్నా ఇంత చేసేవాన్ని కాదేమో...! ఒకనాడు తాగునీళ్ల కోసం కన్నీరుకార్చిన సిద్దిపేట నేడు చుట్టూ జలాశయాలతో కళకళలాడుతూ ఈ ప్రాంతం పచ్చని పంటలతో పులకించిపోతుందన్నారు. నాటి ఎన్నికల నినాదాలన్నీ నేడు నిజమయ్యాయి. ఒక్క గాలిమోటారు మినహా ఇంకా రావాల్సిందేముంది. రాష్ట్రంలోనే ప్రత్యేక గౌరవాన్ని సిద్దిపేటకు తీసుకువచ్చాడు. గతంలోనే రికార్డు మెజార్టీతో హరీష్‌రావును ఆదరించారు. మరోమారు రికార్డు బద్ధలు కొట్టే ఘనత మళ్లీ మీకే దక్కాలన్నారు. దళితబంధుకు ప్రేరణ రామంచ ఆడబిడ్డ. దిక్కుమాలిన కాంగ్రెస్ పాలనలో చేసిందేమీ లేదు. దళిత సమాజానికి ఒకటే చెబుతున్నా.... ప్రాణం పోయినా చివరి కుటుంబం వరకు దళితబంధు అందించేందుకే ప్రయత్నిస్తా. చితికిపోయిన బిసి కులాలకు చేయూతనందించే బిసిబంధు నిరంతర ప్రక్రియ. ఎవరూ అధైర్యపడొద్దు... వర్తక వ్యాపార, ఐటి కేంద్రంగా సిద్దిపేట బాసిల్లుతోంది. మరోమారు సిద్దిపేట పేరు మారుమోగేలా హరీష్‌రావును దీవించండంటంటూ తన ప్రసంగాన్ని ముగించారు కేసీఆర్. ఈ కార్యక్రమంలో జెడ్పి ఛైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మున్సిపల్ ఛైర్మన్ మంజుల రాజనర్సు, సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు సంపత్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ మచ్చ విజిత వేణుగోపాల్‌రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వంగ నాగిరెడ్డి, జంగిటి కనకరాజు, పాలసాయిరామ్, చిన్న, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెన్నమనేని కిషన్‌రావు, నిమ్మ రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం

### మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి



గజ్వేల్, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట్ హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య నాయకులు ఇంటర్నేషనల్‌వైశ్య ఫెడరేషన్ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు కైలాస ప్రభాకర్ సౌజన్యంతో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి హాజరై ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. హనుమాన్ ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా పులిహోర పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భగవంతుడి ఆశీస్సులు ఉంటాయన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరు తమవంతు పాత్ర పోషిస్తున్న కైలాస ప్రభాకర్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నంగునూరి సత్యనారాయణ, భద్రయ్య, నోముల మహేందర్, దుబకుంట లచ్చులు, శ్రీహరి, కైలాస ప్రశాంత్ కుమార్, అయ్యప్ప దేవాలయ ఉపాధ్యక్షులు దుర్గం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు

## చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ



దౌల్తాబాద్, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన బి. స్వామి గ్రామాధ్యక్షుడు అన్న బి. రాజు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు. అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పడాల రాములు, మాజీ మండల అధ్యక్షులు దశరథరెడ్డి, ఉపాధ్యక్షులు స్వామి, మాజీ సర్పంచ్‌లు ఆది వేణుగోపాల్, భద్రయ్య, మండల కార్యదర్శి మల్లారెడ్డి, ఎర్రయ్య, స్వామితోపాటు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**-సిద్దిపేట, గజ్వేల్ తరహాలో**

**దుబ్బాక అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం**

**-మిరుదొడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు**



మిరుదొడ్డి, అక్టోబర్ 17, మనం న్యూస్‌: నవంబర్ 30న జరగబోయే శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మెదక్ ఎంపి అభ్యర్థికికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మిరుదొడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు ఐలయ్య, చార్వాక కుమార్, రమేష్ కోరారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో జరగని అభివృద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో దుబ్బాక నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. గత ఉప ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గ ప్రజలు బీజేపి పార్టీ అభ్యర్థిని గెలిపించడంతో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించినట్లయితే సిద్దిపేట. గజ్వేల్ తరహాలో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధిపరుచుకోవచ్చన్నారు. కార్యకర్తల శ్రేయస్సే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు అమలు చేయని సంక్షేమ పథకాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎల్లయ్య, సాయి, కుమార్, బాబుతోపాటు తదితరులు ఉన్నారు.



## బీజేపిలో చేరిన చక్రదారి భైరవట్ల



చేర్యాల, అక్టోబర్ 17, మనం న్యూస్‌: గత పదిహేనేళ్లుగా సామాజిక ఉద్యమాలు, ప్రజా సమస్యలు, హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన జాక్ ఛైర్మన్ చక్రధారి మంగళవారం రాష్ట్ర బీజేపి పార్టీ కార్యాలయంలో బీజేపి చీఫ్ కిషన్‌రెడ్డి, ఈటల సమక్షంలో బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. మోదీ విధానాలకు ఆకర్షితుడై హైదరాబాద్‌లో పూర్వ పరిషద్ విద్యార్థి నాయకులు, హైకోర్టు వకీలు చక్రధారి పార్టీలో చేరినట్లు తెలిపారు. జనగామలో అసెంబ్లీ టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ ఆదేశాల మేరకు అభ్యర్థి గెలుపు కోసం తమ టీమ్ పని చేస్తుందన్నారు. నాన్ లోకల్ పల్లాను ఓడించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వడానికి జనగామ ఓటర్లు ఎదురు చూస్తున్నారని, అలాగే చేర్యాల నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ అభ్యర్థిని జనగామలో ఓడించి బీజేపి జెండా ఎగురవేస్తామన్నారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట, జనగామ ప్రాంతాల నుండి యాభై వాహనాలలో వందల మంది బీజేపిలో చేరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బీజేపి ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్, మహిళా మోర్చ నాయకులు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## సంతోషిమాత దేవాలయంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



గజ్వేల్, అక్టోబర్ 17, మనం న్యూస్‌: గజ్వేల్ పట్టణంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో శరన్నవరాత్రి వేడుకలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. పురోహితులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో సంతోషి మాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న సంతోషిమాత దేవాలయంలో మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి దంపతులు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ అందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపి అమ్మ దయ ఉంటే అంతా మంచే జరుగుతుందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో దుర్గామాతను వాడవాడలా నెలకొల్పి భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు అమ్మవారి కృప కటాక్షాలు పొందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అన్నదానం మహాదానని, శరన్నవరాత్రి వేడుకల్లో ప్రతి రోజు సంతోషిమాత అమ్మవారి దేవాలయంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

**భారీగా బీజేపిలో చేరిన అల్వాల యువకులు**

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు**



మిరుదొడ్డి, అక్టోబర్ 17, మనం న్యూస్‌: మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామ యువకులు సుమారు 50 మంది వివిధ పార్టీల నుండి భారతీయ జనతా పార్టీలో చేరగా దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ బిఆర్ఎస్ అవలంభిస్తున్న అవినీతిపై ప్రజలకు వివరించాలని కోరారు. కార్యకర్తలు దుబ్బాక నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడం కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలన్నారు. బిఆర్ఎస్ పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించకపోవడంతో ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన చూసి బీజేపిలో చేరడానికి యువత ముందుకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇంచార్జ్ డా. రవిందర్, గుర్రప్పగారి నిఖిల్, అనిల్ యాదవ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## మండల ప్లంబర్ యూనియన్ అధ్యక్షులుగా పెంటం మల్లికార్జున్



దుబ్బాక, అక్టోబర్ 17, మనం న్యూస్‌: దుబ్బాక మండల ప్లంబర్ యూనియన్ అధ్యక్షులుగా పెంటం మల్లికార్జున్ ఎన్నికయ్యారు. మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో ప్లంబర్ యూనియన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం మండల ప్లంబర్ యూనియన్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి పెంటం మల్లికార్జున్‌ను దుబ్బాక మండల ప్లంబర్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కాసర్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షాదుల్, క్యాషియర్‌గా రంజిత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమకు అధ్యక్ష పదవి ఇచ్చినందుకు పెంటం మల్లికార్జున్ యూనియన్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అండగా ఉంటామన్నారు.



## మానవత్వం చాటుకున్న మున్నూరు సంఘం

జగదేవ్‌పూర్, అక్టోబర్ 17, మనం న్యూస్‌: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువు మెట్లను శుభ్రం చేస్తుండగా ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం గ్రామ మున్నూరు సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం యాదమ్మ, భారతి కుటుంబాలకు రూ. 6 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. బాబు కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు కొట్టాల మల్లేశం, మాజీ మండల అధ్యక్షులు రాజు, ప్రధాన కర్యాదర్శి నరేందర్, గ్రామ కమిటీ అద్యక్షులు కనకయ్యలు మాట్లాడుతూ గ్రామాన్ని బాగు చేసే పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారు పేద కుటుంబాలు కావడంతో మానవతా దృక్పథంతో వారి కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కనకరాజు, నరేష్, నాగరాజు, నరేందర్, భాస్కర్, రాములు, లక్ష్మణ్, వెంకటేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు బ్రాహ్మణ వేదపండితుల మద్ధతు

**వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఏకగ్రీవ తీర్మాణ పత్రం అందజేత**



గజ్వేల్, అక్టోబర్ 17, మనం న్యూస్‌: గజ్వేల్ నియోజకవర్గంలోని బ్రాహ్మణ వేద పండితులు కేసీఆర్‌కు మద్ధతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాణాన్ని ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ సీఎంగా మూడవసారి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని, గజ్వేల్‌లో భారీ మెజార్టీ ఇస్తామని బ్రాహ్మణులు ఎఫ్‌డిసి ఛైర్మన్‌ను కలిసి ఏకగ్రీవ తీర్మానం చేసిన కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌కు లక్ష పై చిలుకు మెజార్టీ అందిస్తామన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌ను అన్ని హంగులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. గజ్వేల్ రూపురేఖలు మారాయన్నారు. గజ్వేల్ అభివృద్ధికి మంత్రి హరీష్‌రావు ఎప్పటికప్పుడు కృషి చేస్తూ అభివృద్ధిలో ఎంతగానో సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# ముచ్చటగా మూడోసారి బిఆర్ఎస్‌దే అధికారం

### -హ్యాట్రిక్ సీఎంగా నిలవనున్న కేసీఆర్

### -మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ వాట న్నింటినీ దశల వారీగా పూర్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని నేడు దేశానికే ఆదర్శంగా నిలిపిందని టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్, టిఎస్ఎంఐడిసి ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ భూపాల్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని చింతా ప్రభాకర్ క్యాంప్‌కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని చింతా ప్రభాకర్ అన్నారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని, బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు రెండుసార్లు గెలిపించారన్నారు. ముచ్చటగా మూడవసారి కూడా రాష్ట్రంలో బిఆర్ఎస్ గెలవబోతుందని, అన్ని వర్గాల ప్రజల కోసం తెచ్చిన బిఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. అంతేకాకుండా మూడవసారి కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా నిలిచి హ్యాట్రిక్ సీఎంగా నిలువబోతున్నాడన్నారు. అనంతరం టిఎస్ఎంఐడిసి ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో నెరవేర్చిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ పార్టీకి హామీలు ఇవ్వడం తప్పితే వాటిని అమలు చేయడం చేతకాదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో చేయలేని అభివృద్ధి తెలంగాణలో ఏ విధంగా చేయగలదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ప్రజలను మోసం చేసి పబ్బం గడుపుకోవడానికే ప్రయత్నిస్తుం దన్నారు. బిఆర్ఎస్ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని, మేనిఫెస్టోలో లేని పథకాలను సైతం అమలు చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేసిందన్నారు.



కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం ఎన్ని వేషాలైనా వేస్తారని, వారి మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సంక్షేమానికి పరితపించే చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## చంద్రఘంటా దేవిగా వనదుర్గామాత దర్శనం



పాపన్నపేట, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః ప్రసిద్ధ ఏడుపాయల శ్రీ వనదుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడవ రోజైన మంగళవారం చంద్రఘంటా దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. దేవస్థానం ఛైర్మన్ సాతెల్లి బాలా గౌడ్, ఆలయ అధికారులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో బీజేపి జెండా ఎగురవేస్తాం

### గజ్వేల్ పట్టణ అధ్యక్షులు ఉప్పల మధుసూదన్



గజ్వేల్, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః వచ్చే ఎన్నికల్లో గజ్వేల్‌లో తప్పకుండా బీజేపి జెం డా ఎగురవేస్తామని గజ్వేల్ బీజేపి పట్టణ అధ్యక్షులు ఉప్పల మధుసూదన్ అన్నా రు. మంగళవారం మ ధుసూదన్ ఆధ్వర్యం లో పార్టీ ముఖ్య కార్య కర్తల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పార్టీల నుండి భారీగా చేరికలు ఉన్నాయని, ప్రధానిమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, దేశాభివృద్ధి చేసి మరోసారి మోదీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గంలో కూడా బీజేపి పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు శాయశక్తులా పని చేస్తామని, గజ్వేల్‌లో బీజేపి జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ విస్తారక్ చేకూటి అనూష్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మైస విజయ్, నరసింహచారి, బీజేపి మహిళా మోర్చ కార్యదర్శి సుమతి, గజ్వేల్ పట్టణ కిసాన్‌మోర్చ అధ్యక్షులు మర్కంటి ఏగొండతోపాటు పాల్గొన్నారు.

## ప్రజల ఆదరాభిమానాలే భగవంతుడి ఆశీస్సులు



### -సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

### -దౌల్తాబాద్ మండలంలో ప్రచారం ప్రారంభం

దౌల్తాబాద్, అక్టోబర్ 17, మనం న్యూస్‌ః నిరంతరం ప్రజా సంక్షే మం, దేశ రక్షణ, ధర్మ సంరక్షణ కోసం పాటుపడే భారతీయ జనతా పార్టీకి ప్రజల ఆదరాభిమానాలే భగవంతుని ఆశీస్సులతో సమా నమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం రోజున దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలోన శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మండలంలో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చదువుకున్న విద్యార్థుల కు అన్యాయం జరిగిందని, విద్యార్థులు రాత్రింబవళ్లు చదువుకుంటే గ్రూప్ 4 పరీక్ష రాస్తే పేపర్ లీక్ చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ఎంతగానో వెనక్కి నెట్టివేయబడిందన్నారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని స్థితిలో టిఎస్‌పిఎస్‌సి, బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నా యని, ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో బీజేపికి ఓట్లేసి బిఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్పాలన్నారు. నిరంతరం బీజేపి పార్టీ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందని, కేంద్రంలోని బీజేపి ప్ర భుత్వం దేశ ప్రజలందరికి ఎన్నోరకాల సంక్షేమ పథకాలు ప్రవేశపె ట్టినప్పటికీ చాలా వరకు పథకాలు తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. నేడు రాష్ట్రంలో అమలవు



తున్న పథకాలు సైతం బీజేపివే అని, కానీ వాటి పేర్లు మార్చి తమ పథకాలుగా బిఆర్ఎస్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్‌కు కేవలం సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లోనే అభివృద్ధి చేయాలని ఉంటే మరి దుబ్బాక ప్రజలు ఏం పాపం చేశారని నిధులు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. ఏ ఒక్క మంత్రి కూడా దుబ్బాక నియోజకవర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చినా అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఈ నిరంకుశ పాలన పోవాలంటే ఈసారి ఎన్ని కల్లో దుబ్బాక గడ్డపై బీజేపి పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోతురాజు కిషన్, మాజీ అధ్యక్షులు కుమ్మరి నర్సింలు, ఉపాధ్యక్షులు గడ్డమీద స్వామి, నాయకులు ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్

**-బూటకపు మాటలతో మోసం చేస్తున్న బిఆర్ఎస్, బీజేపి**

**-ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తా**

**-కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**





దుబ్బాక టౌన్, అక్టోబర్ 17, మనం న్యూస్ః రైతు సంక్షేమానికి కృషి చేసిన పార్టీ, రైతును రాజును చేయగలిగే పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీయే అని, వందకు వందశాతం రైతుపక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివంగత నేత ముత్యంరెడ్డి ఆశయ సాధన మేరకు శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర 105వ రోజున మంగళవారం దుబ్బాక పట్టణంలోని బిసి కాలనీ, ఎస్సీ కాలనీలో సాగింది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రజా సంక్షేమానికి, రైతు సంక్షేమానికి అమలు చేసిన పథకాలు చేపట్టిన కృషిని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే అమలు చేయబోయే హామీలను ప్రజలకు గడప గడపకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నేడు తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ పాలనలో ఆత్మహత్యలే ఉండవని మాట్లాడిన కేసీఆర్ మాటలు బూటకపు మాటలని, నేటికీ ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని ఇది చాలాబాధాకరమైన విషయమన్నారు. స్వరాష్ట్రంలోనూ రైతుల ఆత్మహత్యలు తగ్గకపోతే ఇక ఎప్పుడు రైతుల బతుకులు మారుతాయన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతుల సంక్షేమానికి చేపట్టిన పథకాల ద్వారా రైతులు మూడు పంటలు పండించుకొని చేతినిండా పంటతో సంతోషంగా ఉండేవారన్నారు. అదేవిధంగా ప్రజా సంక్షేమాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలి ప్రజలకు మాయమాటలు చెప్తూ అటు కేంద్రంలో, ఇటు దుబ్బాకలో ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావులు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్, బీజేపిలు చేస్తున్న బూటకపు హామీలను కాంగ్రెస్ గుర్తించి ప్రజలకు సంక్షేమాన్ని అందించేందుకు గాను ఆరు గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ. 2500లు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసాతో ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి ప్రతి నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 చ.గ. స్థలాన్ని, యువ వికాసంద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, చేయూత ద్వారా వితంతువులు, వికలాంగులకు, బీడీ కార్మికులతో పాటు ఇతరులకు నెలకు రూ. 4 వేల పింఛన్, పేదలకు రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీబీమా అందిస్తామన్నారు. కావున ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అంతకుముందు వివిధ గ్రామాల నుండి పలువురు మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు ఏసురెడ్డి, మండల అధ్యక్షులు కొంగరి రవి, జనరల్ సెక్రటర్ మంద శ్రీనివాస్, నాయకులు ఆకుల భరత్, శ్రీకాంత్, బాస మధు, మట్ట కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మా సంపూర్ణ మద్దతు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికే

**పటాన్‌చెరు నాయి బ్రాహ్మణ సంఘం ఏకగ్రీవ తీర్మానం**

పటాన్‌చెరు, అక్టోబర్ 17, మనం న్యూస్ః పటాన్‌చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించి ఏకగ్రీవ తీర్మానం చేసిన కాపీని నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో పటాన్సెరు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రతి ఎన్నికలో తన వెన్నంటి నిలవడం సంతోషంగా ఉందన్నారు. నాయిబ్రాహ్మణ కుటుంబాలు ఏకగ్రీవం తెలపడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నాయకత్వంలో నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం పెద్దపీట వేయడంతోపాటు హెయిర్ సెలూన్లకు ప్రతినెలా ఉచితంగా 250 యూనిట్లు విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. దీంతోపాటు బిసిబంధు పథకం ద్వారా అర్హులైన వారికి స్వయం ఉపాధి కోసం ఎలాంటి షరతులు లేకుండా లక్ష రూపాయలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఏఎంసి ఛైర్మన్ విజయ్‌కుమార్, గూడెం మధు సూదన్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు శ్యామ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వినోద్, నారాయణ, చంద్రయ్య, నర్సింగరావు, వెంకటేష్, నిరంజన్, దినేష్‌కుమార్, విష్ణు, పద్మనాభం, శివ తదితరులు పాల్గొన్నారు.



## తొమ్మిదేళ్ల పాలనలో గుర్తురాలేదా నవరత్నాలు

**-మా మేనిఫెస్టోకు వణికిపోయి కొత్త నాటకం షురూ**

**-బిఆర్ఎస్ మాటలను ప్రజలు నమ్మరు**

**-ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై ధ్వజమెత్తిన నీలం మధు ముదిరాజ్**



గుమ్మడిదల, అక్టోబర్ 17, మనం న్యూస్ః తొమ్మిదేళ్ల పాలనలో పటాన్‌చెరు నియోజకవర్గానికి ఈ నవరత్నాలు గుర్తుకు రాలేదా, ఇప్పుడు న వరత్నాల మేనిఫెస్టో పేరుతో కొత్త డ్రామా షురూ చేశారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు ముదిరాజ్ ప్రశ్నించారు. రెండవ రోజు 'మీ కొడుకు మీ గుమ్మంలో' పాదయాత్రలో భాగంగా గుమ్మడిదల మండల కేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు నీలం మధు ముదిరాజ్‌కు ఘన స్వాగతం పలికి తమ బిడ్డలా ఆదరించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను నీలం మధు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలు పటాన్‌చెరు ఎమ్మెల్యేగా పని చేస్తున్న ఎమ్మెల్యే మమిపాల్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిందేంటో చెప్పాలన్నారు. పదేళ్లగా చేయని పనులు ఇప్పుడు చేస్తానని నవరత్నాల పేరుతో మేనిఫెస్టో విడుదల చేసి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నాడని ధ్వజమెత్తారు. తాము ప్రవేశపెట్టిన ప్రజా మేనిఫెస్టోలోని ఐదు అంశాలతో తన సీటు గల్లంతయితుందని వణికిపోయి అప్పటికప్పుడు నవరత్నాలు ప్రకటించాడని విమర్శించారు. ఎమ్మెల్యే తనకు ఓట్ల కోసం ఎన్ని బూటకపు మాటలు చెప్పి మభ్యపెట్టినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. అహంకారానికి, ఆత్మ గౌరవానికి మధ్య జరుగుతున్న పోరులో ప్రజలు స్పష్టంగా ఆత్మగౌరవ పోరాటానికి అండగా నిలబడి వారి ఇంట్లో బిడ్డనైన నీలం మధును ఎమ్మెల్యేగా గెలిపించడానికి నిర్ణయించుకున్నారన్నారు. గడపగడపలో తనను కన్న బిడ్డలా ఆదరిస్తున్నారన్నారు. ఈ ఆత్మ గౌరవ పోరాటంలో ప్రజలంతా తన పక్షాన నిలబడి ఒక్కసారి ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీ ఇంట్లో బిడ్డగా మీ ముందుకు వస్తున్న మీ నీలం మధును గెలిపిస్తే మన అభివృద్ధి మనమే చేసుకుందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## 108, 102 వాహనాల తనిఖీ

పాపన్నపేట, అక్టోబర్ 17, మనం న్యూస్ః మండల కేంద్రంలో పని చేస్తున్న 108, 102 వాహనాలను ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్, మెదక్‌జిల్లా సూపర్‌వైజర్ మహేష్‌కుమార్‌లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 108లో ఉన్న మందులు, పరికరాలను తనిఖీ చేసి పరికరాలు ఎలా పని చేస్తున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 102 అమ్మ ఒడి వాహనాలను గర్భిణీ స్త్రీలను, బాలింతలను ఆసుపత్రికి, ఆసుపత్రి నుండి ఇళ్లకు సురక్షితంగా చేర్చాలని సూచించారు. వారి వెంట 108 సిబ్బంది దుర్గా ప్రసాద్, సతీష్, 102 కెప్టెన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.














# గులాబీమయం

సిద్దిపేట, అక్టోబర్ 17, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ పేరుతో సిద్దిపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సభతో సిద్దిపేట గులాబీమయమైంది. లక్ష మందితో జనగర్జన అంటూ ప్రకటించి నట్లుగానే ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో సభా ప్రాంగణం నాగదేవత బైపాస్‌ర ఒడ్డు జనసంద్రంగా మారింది.

సాయంత్రం 5:50 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ హెలీకాప్టర్‌లో సభాస్థలికి చేరుకోగా మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. యువకులు పెద్ద సంఖ్యలో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మహిళలు బోనాలతో, బతుకమ్మలతో తమ సంబరాన్ని చాటుకున్నారు. మేధావులు, కళాకారులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావం ప్రకటించారు. మిట్టపల్లి సురేందర్ నేతృత్వంలోని కళాబృందం ప్రజా ఆశీర్వాద సభను ఉర్రూతలూగించింది. గులాబీ జెండలే.... అనే పాటతో ఓవర్‌నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న లక్ష్మమ్మ నేతృత్వంలోని బృందం స్వయంగా స్టేజిపై గీతాన్ని ఆలపించడంతో స్టేజి మొత్తం ఊర్రూతలూగింది. ఒక దశలో హరీష్‌రావు సైతం చప్పట్లతో సభికులను ఉత్సాహపరిచారు.














